మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## వరదకు కొట్టుకుపోయిన రోడ్డు



వరదకు కొట్టుకు పోయిన రోడ్డు

**సిర్గాపూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వాసర్ గ్రామ శివారులోని వాగు వంతెన సమీపంలో రోడ్డు కోతకుగురై ప్రమాదకరంగా మారింది. సింగిల్ రోడ్డు కావడంతో సంగం రోడ్డు కోతకు గురి కావడంతో అటు వెళ్లాలంటే ప్రాణసంకటంగా మారిందని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన ప్రాంతంలో అధికారులు కనీసం ప్రమాద సూచిక బోర్డును ఏర్పాటు చేయక పోవడాన్ని ప్రజలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బద్దిపడగ జడ్పీ హెచ్‌ఎం పద్మ సస్పెన్షన్..

**నంగునూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బద్దిపడగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మను ఆర్‌జెడి అనుమతితో సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం బద్దిపడగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సోమవారం మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వెజిటేబుల్ కర్రీ, కిచిడి, గుడ్డు అందించాల్సి ఉండగా అన్నం సాంబారు మాత్రమే అందించడాన్ని గుర్తించిన కలెక్టర్ హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంబారు సైతం పప్పుతో కాకుండా మొక్కజొన్న పిండి ఇతర పదార్థాలతో వండినట్లు గుర్తించారు. అలాగే సాంబారు విద్యార్థులకు సరిపడనంతా తయారు చేయకుండా తన ముందే సాంబారులో నీరు పోయడంతో కలెక్టర్ వెంటనే హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని డిఈవోను ఫోన్‌ద్వారా ఆదేశించారు. దీంతో వరంగల్ ఆర్‌జెడి అనుమతితో జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశాల మేరకు హెచ్‌ఎం పద్మను సస్పెండ్ చేస్తూ డిఈవో శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ కృష్ణ

## మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

### -ఎంఈఓ కృష్ణ

**గజ్వేల్, అక్టోబరు 14(ప్రభాతవార్త):** క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని గజ్వేల్ మండల విద్యాధికారి కృష్ణ తెలిపారు. మంగళవారం ప్రజ్ఞాపూర్‌లోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో 69వ ఎస్‌జిఎఫ్ఐ క్రీడలను నిర్వహించారు. అండర్-14, అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ కృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో దాగివున్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గ్రామీణ క్రీడాకారులు ప్రతిభ చూపేలా శిక్షణ అందించబడుతుందన్నారు. మండలస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందని, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన బాల బాలికలను రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయి క్రీడలకు ప్రజ్ఞాపూర్‌లో ఆతిధ్యమివ్వడం గర్వకారణమన్నారు. జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడలు నిర్వహించేందుకు ప్రజ్ఞాపూర్ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు సౌకర్యాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అలాగే ప్రజ్ఞాపూర్‌కు చెందిన కొనమైన కన్నాయాదవ్ క్రీడాకారులకు భోజనం, త్రాగునీరు తదితర సదుపాయాలను కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడల్లో అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన సిద్దిపేట జట్టు నిలువగా రన్నర్ స్థానంలో సంగారెడ్డి జట్టు నిలిచిందని, అండర్-14 బాలుర విభాగంలో సంగారెడ్డి జట్టు విజయం సాధించగా, రన్నర్‌గా సిద్దిపేట జట్టు నిలించిందన్నారు. అండర్-17 బాలికల విభాగంలో సిద్దిపేట జట్టు విజయం సాధించగా రన్నర్‌గా సంగారెడ్డి జట్టు నలిచిందని, అండర్-14 విభాగంలో సంగారెడ్డి జట్టు విజయం సాధించగా రన్నర్‌గా సిద్దిపేట జట్టు నిలిచిందన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన జట్లకు ఎంఈఓ కృష్ణ బహుమతులను అందజేశారు. జిల్లా స్థాయి క్రీడలను ప్రజ్ఞాపూర్‌లో ఏర్పాటు చేయడంతో బాలుర పాఠశాలకు చెందిన పిఈటి విజయరేఖ క్రీడల నిర్వహణకు చేసిన కృషిని ఏంఈఓ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, పిఈటి ఎలియాస్‌రావు, రాజి ప్రభు, పూర్వ విద్యార్థులు కదుల్ల ఎల్లేశం, బద్రి పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరగకుండా చూడాలి

### అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బిజెపి కిసాన్ మోర్చా



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**మెదక్ టౌన్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** మెదక్ జిల్లాలో వర్షాకాలం రైతుల పంట కొనుగోలు సమస్యల గురించి మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో 148 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని ప్రభుత్వం స్వయంగా అంచనా వేసిందనీ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా, ధాన్యం సేకరణలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ముందుగానే ఐకెపి సెంటర్లు, సొసైటీలు ఏర్పాటు చేయాలన్నారు. రవాణా కోసం లారీల సౌకర్యం ఉండేలా చూడాలని, ధాన్యం బస్తాలు, కూలీలు, లేబర్‌ని ఏర్పాటు చేయాలన్నారు. కల్లాలలోకి వచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసే విధంగా చూడాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వ నిబంధనకు మించి తూకం వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యము డబ్బులను రైతుల ఖాతాల్లో త్వరగా జమ అయ్యేలా చూడాలన్నారు. సన్నాలకు సంబంధించి గతంలో రైతుల అకౌంట్లో వేయని బోనస్ డబ్బులు వెంటనే వేసి, సన్న వడ్లకు బోనస్ డబ్బులు వేయడంలో జాప్యం చేయకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతుల పంటలకు వెంటనే నష్టపరిహారం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాళ్దాస్ రాధామల్లేష్ గౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన తండాలో తాగునీటికి తిప్పలు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 14,ప్రభాతవార్త:** తాగునీటికి తండా వాసులు తీవ్ర కష్టాలు పడుతున్నామని తెలిపారు. చిన్న శంకరంపేట మండల పరిధి కామారం పెద్ద తండాలో గత కొన్ని రోజులుగా త్రాగునీలు రావడంలేదని, వ్యవసాయ బోధ వద్దకు వెళ్లి పొలాల వెంట ఇబ్బంది పడుతూ మంచినీటిని తెచ్చుకుంటున్నామని మహిళలు తెలిపారు. అధికారులు స్పందించి ఆ పైప్ లైన్లకు మరమ్మత్తులు చేసి త్రాగునీటి కష్టాలను తీర్చాలని తండావాసులు కోరుతున్నారు.

## మిషన్ భగీరథ నీటికి ఇబ్బందులు లేవు

### పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత

కామారం తండాలో ప్రతి ఇంటికి రెండు నల్లాలు ఉంటాయని, అందులో ఒకటి మిషన్ భగీరథ నీళ్లది కాగా మరొకటి మంచినీటి కోసం బోరుబావి నుండి వచ్చే నీళ్లు అని తెలిపారు. కాగా బోరుబావి నుండి వచ్చే నీళ్లను ప్రత్యేకంగా తాగునీటి కోసమే వినియోగించే ట్యాంకులోకి నింపి ప్రతి ఇంటికి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. తాండవాసులు ఆ నీటిని మాత్రమే తాగుతారని, మిషన్ భగీరథ నీరు త్రాగడానికి ఆసక్తి చూపించరని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా కోనో కార్పస్ చెట్లు ఉండటం వల్ల వాటి వేర్లు మంచినీరు సరఫరా అయ్యే పైప్ లైన్ లోకి చొచ్చుకుపోయి ఆ పైప్ లైన్‌లు దెబ్బతిన్నాయని, నూతన పైప్ లైన్ వేయాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు వచ్చి పరిశీలించి కొత్తనీటి పైపైన వేయడానికి 80 వేల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లో ఎలాంటి అంతరాయం లేదని స్పష్టం చేశారు. త్రాగునీటిని మాత్రమే వారు వ్యవసాయ బోలోను తెచ్చుకుంటున్నారని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆమె వివరించారు.

# బిల్లులు రాక..వడ్డీలు కట్టలేక..!

- నిధుల కోసం మాజీ సర్పంచ్‌ల నిరీక్షణ
- అభివృద్ధి చేస్తే అప్పులే మిగిలాయని ఆవేదన
- తెచ్చిన డబ్బులకు పెరిగిపోతున్న వడ్డీ
- పదవీకాలం ముగిసి ఏడాదైనా రాని నిధులు
- బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఎదురుచూపులు




**టేక్మాల్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో మాజీ సర్పంచ్‌లు నిధులు మంజూరుకాకపోయినా అప్పులు తెచ్చి వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పనులు పూర్తి చేశారు. 2022, 2023లో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఒత్తిడి తీసుకురావడంతో గత్యంతరం లేక నాటి సర్పంచ్‌లు బయటనుంచి పెద్దమొత్తంలో అప్పులుతెచ్చి పనులు చేపట్టారు. ఒక్కో గ్రామ పంచాయతీకి మాజీ సర్పంచ్‌లు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.20లక్షల వరకు పనులు పూర్తిచేసి బిల్లులు రాక ఎదురుచూస్తున్నారు. రెండేళ్ల గడిచినా గత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదు. దీంతో నాటి సర్పంచ్‌లు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడంతో అవి ఎలా తీర్చాలని మనోవేదనకు గురవుతున్నారు. టేక్మాల్ 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో సగానికి పైగా గ్రామ పంచాయతీలకు బిల్లు రావాల్సి ఉంది. గతంలో అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఎస్టీఎఫ్ నిధులు మంజూరు చేస్తామని చెప్పి, నిధులు మంజూరు చేయలేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల అభివృద్ధి పనులకు తెచ్చిన అప్పులకు వడ్డీ మీద వడ్డీలు పెరిగిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### రెండేళ్లుగా పెండింగ్‌లోనే బిల్లులు..

గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మాజీ సర్పంచ్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు కాకపోయినప్పటికీ బయట నుంచి అప్పులు తీసుకువచ్చి గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో భాగంగా పల్లె ప్రకృతి వనాల నిర్మాణ పనులు, వీధి దీపాలు, శానిటేషన్, మంచినీటి బావి మోటార్ల మరమ్మతులు, నర్సరీల నిర్వహణ, మోటార్ల, స్టార్టర్ల కొనుగోలు, అవెన్యూ ప్లాంటేషన్, మొక్కల కొనుగోలు, శ్మశానవాటిక, డంపింగ్ యార్డు నిర్మాణ పనులు, ట్రాక్టర్ ఈఎంఐ, డీజీల్ మెయింటెనెన్స్ ఖర్చులతోపాటు సీసీ రోడ్లు, సైడ్‌కాలువల నిర్మాణ పనులు చేపట్టారు.

### ప్రభుత్వం బిల్లులు విడుదల చేయాలి

#### సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షురాలు శ్వేతశేఖర్‌రెడ్డి

గ్రామ అభివృద్ధి కోసం అప్పు తెచ్చి శానిటేషన్, వీధిదీపాలు, మోటార్లకు మరమ్మతులు, ట్రాక్టర్, డీజిల్, డంపింగ్ యార్డు, సీసీ పనుల చేశామని టేక్మాల్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షురాలు కుర్తి శ్వేతశేఖర్‌రెడ్డి అన్నారు. మండల సర్పంచ్‌లు లక్షలరూపాయలు ఖర్చు చేశారన్నారు. తెచ్చిన డబ్బులకు వడ్డీల మీద వడ్డీలు పెరిగిపోతున్నాయి. వడ్డీలు కట్టలేక పోతున్నాం. ప్రభుత్వం స్పందించి మాజీ సర్పంచ్‌ల బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నారు.

## గంజాయి సాగును డ్రోన్ కెమెరాలతో తనిఖీ

**సిర్గాపూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పటేల్ తండా, గైరాన్‌తండా గ్రామాల శివారులో రైతులు సాగు చేసుకుంటున్న పత్తి పంటలో అంతర్ పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు అనుమా నించి డ్రోన్ కెమెరాల సహాయంతో మంగళవారం పోలీసులు తనిఖీ చేశారు. గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ మహేష్ హెచ్చరించారు. గంజాయి సాగుచేస్తూ దొరికితే కేసలు నమోదు కావడంతోపాటు ప్రభుత్వం నుంచి అందుకుంటున్న సంక్షేమ పథకాలను ఆపేయడం జరుగుతుందన్నారు. గంజాయి సాగు చేస్తున్న వారి వివరాలను పోలీసులకు అందచేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని సిఐ, ఎస్ఐలు పేర్కొన్నారు.



పంట సాగులో గంజాయి మొక్కల సాగును పరిశీలిస్తున్న డ్రోన్ కెమెరాలు

# ధాన్యం సేకరణలో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**రామాయంపేట, అక్టోబరు 14, ప్రభాతవార్త :** రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మంగళవారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో 498 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని, అందులో 430 వరి కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే మొదలయ్యాయని అన్నారు. 10 కేంద్రాలకు ధాన్యం రావడం మొదలైందని చెప్పారు. దీపావళి తర్వాత మరింతగా ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే విషయంలో అక్రమాలకు తావిస్తే క్రిమినల్ కేసులు పెడతామని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి పోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం మిల్లులకు పంపాలని అన్నారు. తూకం యంత్రాలు, గ్రెయిన్ క్యాలిపర్స్, తేమ కొలిచే యంత్రాలు వంటివి సరిపడా అందుబాటులో ఉండాలని తెలిపారు. ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలలో సమకూర్చమని చెప్పారు. రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి త్వరగా వారి అకౌంట్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోనాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ రాహుల్‌రాజ్

# సేంద్రియ విధానంలో పంట సాగు చేస్తే అధిక లాభాలు

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** అధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకొని సేంద్రియ విధానంలో సాగు చేస్తే అధిక లాభాలతో పాటు ప్రజలకు ఎంతో మేలు చేసినవారవుతారని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామంలో ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన వ్యవసాయ ప్రదర్శనలో స్టాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంటలకు అధిక మొత్తంలో యూరియా, క్రిమిసంహారక మందులను ఉపయోగించవద్దని, దీనివల్ల నేల,నీరు, గాలి కలుషితం అవుతుందన్నారు. చిన్నతనంలో తనూ వ్యవసాయం చేశానని గుర్తుచేశారు. యువ రైతు వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, దీంతో ఖర్చు తగ్గడంతో పాటు పంటల దిగుబడి వస్తుందన్నారు. సేంద్రియ సాగు వ్యవసాయానికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి సంతోష్‌కుమార్, ఎడిఎ పద్మ, అసోసియేషన్ డిఎన్ఎజి కాలేజీ సిరిసిల్ల సునీతదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చూడాలి...

ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో భూ భారతి పెండింగ్ అప్లికేషన్, డిస్పోజల్ ప్రక్రియపై ఆర్డీఓ, తహసీల్దార్లు ఇతర రెవెన్యూ అధికారులతో కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఆర్డీఓ, ఎసి రెవెన్యూ లాగిన్‌లో ఉన్న పెండింగ్ అప్లికేషన్‌లు వేగంగా పూర్తి చేయాలన్నారు. భూ భారతి చట్టంలోని మార్గదర్శకాల ప్రకారమే అప్లికేషన్ డిస్పోసల్ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

### విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు...

**సిద్దిపేట రూరల్, అక్టోబరు 14, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తోర్నాల జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జిల్లా కలెక్టర్ మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె.హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలుగడ్డ టమాటా కూర, పచ్చిపులుసు మాత్రమే ఉండారని కామన్ డైట్ మెనూలో భాగంగా మిక్స్డ్ వెజిటేబుల్ కర్రీ సాంబారు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చి పులుసు పెడుతూ పిల్లలు అనారోగ్య పాలవడానికి కారకులవుతున్నారని వంట సిబ్బందిపై మండిపడ్డారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే మధ్యాహ్న భోజన ఉద్దేశమన్నారు. వంట సరుకులు, రైస్, కూరగాయలు కొలత పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థుల హాజరు ప్రకారం రైస్, కూరగాయలు కొలత ప్రకారం వంట సిబ్బందికి ఇవ్వాలని ఫుడ్ ఇన్‌చార్జిని ఆదేశించారు. విద్యార్థులకు పచ్చి పులుసు పెడుతున్నందుకు, సరిపడినంత ఆహారం పెట్టనందుకుగానూ హెచ్‌ఎంతో పాటు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిఈవోను ఫోన్‌లో ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని ఆరోగ్యంగా ఉంటేనే మంచిగా చదువుకుంటారని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.




మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

## మహిళ అత్యాచారం, హత్య కేసులో వ్యక్తి అరెస్ట్

### వివరాలు వెల్లడించిన ఎస్‌పి శ్రీనివాసరావు

**మెదక్ టౌన్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** మహిళపై అత్యాచారం, హత్య కేసులో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. మెదక్ పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ డి శ్రీనివాసరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొల్చారం మండలం ఏడుపాయల బ్రిడ్జ్ వద్ద గత శనివారం జరిగిన గిరిజన మహిళ అత్యాచారం కేసు వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సేవాలాల్ తండాకు చెందిన మెగావత్ ఫకీర నాయక్ సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం అంబుజిగూడ గ్రామంలో నివసిస్తున్నాడని, ఇతడు ఈనెల 10వ తారీఖున సాయంత్రం సమయంలో మెదక్ మండలంలోని సంగాయిగూడ తండాకు చెందిన కాట్రోత్ కమ్లా అనే మహిళను మెదక్ నుండి కూలి పని కోసం తీసుకువచ్చి, ఏడుపాయల దేవస్థానం దారిలోని 3వ వంతెన దాటిన తరువాత, గాలి అనిల్‌కుమార్ వెంచర్ వెనుక చెట్ల మధ్యకు తీసుకెళ్లి, ఆమెను చీరతో కట్టేసి మానభంగం చేసి, రాయితో తలపై బలంగా కొట్టి, ముక్కుపుడక దోచుకొని అక్కడి నుండి పారిపోయాడని తెలిపారు. ఎవరో ఒక వ్యక్తి చూసి 100 ఫోన్‌చేసి తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అపస్మారకస్థితిలో ఉన్న మహిళను పోలీస్ వాహనంలో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందినట్లు పేర్కొన్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. అతడిపై ఇదివరకే మెదక్ టౌన్, అల్లాదుర్గం పోలీసుస్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడిని మంగళవారం మెదక్ పట్టణంలో అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కేసును వేగంగా చేధించడంలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, బృందం సిబ్బందిని అభినందించి, నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం

**నర్సాపూర్ రూరల్, అక్టోబరు 14,ప్రభాతవార్త:** నర్సాపూర్ మండల పరిధి రుస్తుంపేటకు చెందిన దుర్గయ్య(45) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్ఐ రంజిత్ కుమార్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రుస్తుంపేట గ్రామానికి చెందిన దుర్గయ్య మేస్త్రి పని చేస్తుంటాడు. ఈ నెల 12వ తేది ఆదివారం నాడు బంధువుల పెళ్లికి భార్యతో సుజాతతో వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా ఇంటికి కొద్ది దూరంలో భార్య సుజాతను దించి పని ఉందని చెప్పి వెళ్లిపోయాడు. సాయంత్రం దుర్గయ్యకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో రాత్రి వరకు చూసినా రాకపోవడంతో, కంగారు పడిన కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. ఈ విషయమై భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

### సంగారెడ్డి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబరు 14, ప్రభాతవార్త:** ఫేక్ డీపీ (నకిలీ ప్రొఫైల్) ద్వారా సైబర్ మోసాలకు పాల్పడుతున్న నిందితున్ని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే..బాధితుడు హత్నూర మండలానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి. ఆగస్టు 1వ తేదీన సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదు ప్రకారం హత్నూర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశానుసారం సెంట్రల్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టగా ఈ సంవత్సరం జనవరి నుండి ఏప్రిల్ మధ్యకాలంలో డక్ చాట్ క్లబ్ యాప్ అనే మొబైల్ అప్లికేషన్ ద్వారా అమ్మాయిగా నకిలీ ప్రొఫైల్ తో పరిచయమైన సైబర్ నేరగాడు ప్రేమ పేరుతో మోసం చేస్తూ, బెదిరింపులకు గురిచేస్తూ బాధితుడి నుండి పది లక్షల ముప్పై మూడు వేల రూపాయలు యుపిఐ ద్వారా బదిలీ చేయించాడు. విచారణ ప్రారంభించిన సిసిఎస్ బృందం టెక్నికల్ సాక్ష్యాల ఆధారంగా నిందితుడు సీలం సంజయ్ కుమార్ ను అరెస్ట్ చేయగా, అతనికి సహకరించిన మరో నిందితుడు పరారిలో ఉన్నాడని ఎస్పీ అన్నారు. నిందితుడి నుండి మూడు లక్షల 63వేలు నగదు, ఒక సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడు సీలం సంజయ్‌కుమార్, 19 సంవత్సరాలు, వృత్తి: విద్యార్థి, గ్రామం: మార్కాపూర్, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్. పరారీలోఉన్న మరో నిందితుడు 2. గడ్డం ప్రకాశ్, మార్కాపూర్, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్‌గా గుర్తించినట్టు జిల్లా ఎస్పీ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తులతో స్నేహాలకు దూరంగా ఉండాలని, ధన లావాదేవీలు చేయడం, లేదా నమ్మకం ఉంచడం వంటి చర్యలు మోసాలకు దారి తీయవచ్చని గ్రహించాలని అన్నారు. కేసు చేదనలో కీలకంగా వ్యవహరించిన డిఎస్‌పి ఎన్.వేణుగోపాల్‌రెడ్డి, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, జిన్నారం సీఐ మొహమ్మద్ నయీంఉద్దీన్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ పి.రామునాయుడు, ఎస్‌ఐపి, సిసిఎస్ సంగారెడ్డి కె. శ్రీకాంత్, సిసిఎస్, హత్నూర పోలీస్‌స్టేషన్ సిబ్బందిని ఎస్పీ ప్రశంసించారు.

## బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిపై దాడి.. విచారణ

**జోగిపేట, అక్టోబరు 14, ప్రభాతవార్త:** టేక్మాల్ మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప దంపతులపై సోమవారం అల్మాయిపేట వద్ద జరిగిన దాడికి సంబంధించి మంగళవవారం సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్యగౌడ్ విచారణ చేపట్టారు. జోగిపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన సంఘటనకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కాగా దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

### దాడికి పాల్పడిన ఇద్దరు యువకులు అరెస్ట్

అల్మాయిపేట వద్ద బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప దంపతులపై తీవ్రమైన దాడికి పాల్పడిన అందోలుకు చెందిన ఇద్దరు యువకులు శాహెద్, జాఫర్‌లను మంగళవారంనాడు అరెస్ట్ చేసినట్టు జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.



దాడికి పాల్పడిన యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు

## వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న రైతులు, అధికారులు తదితరులు

**నర్సాపూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
రైతునేస్తం కార్యక్రమంలోభాగంగా మంగళవారం నర్సాపూర్ రైతువేదికలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు అధికారుల వీక్షించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని రైతు కమిషనరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట సాగుచేసే రైతులకు 100శాతం సబ్సిడీ ఇస్తామని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పర్యటించి ఆయిల్‌పామ్ పంటపై రైతులకు అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ మేరకు నారాయణపేటలోని 500మంది రైతులు ఈ ఆయిల్‌పామ్‌పంటను సాగుచేస్తున్నారని వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు తెలిపారు. రైతునేస్తం కార్యక్రమంలో నర్సాపూర్ వ్యవసాయశాఖ ఏడిఏ సంధ్యారాణితోపాటు ఏవోలు దీపిక, మోహన్, జిల్లా రైతురక్షణసమితి ముఖ్య సలహాదారు మిరియాల చంద్రశేఖర్‌గుప్త, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు అన్ని రంగాలలో రాణించాలి

**-జిల్లాసంక్షేమ అధికారిణి హేమభార్గవి**



కార్యక్రమంలో మాట్లాడుతున్న హేమభార్గవి తదితరులు

**నర్సాపూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
బాలికలు అన్నిరంగాలలో రాణించాలని మెదక్ జిల్లా సంక్షేమ అధికారిణి హేమభార్గవి అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని స్థానిక ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్‌జిల్లా సంక్షేమ అధికారిణి హేమభార్గవి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని అన్ని రంగాలలో రాణించాలని తెలియజేశారు. అంతేగాక ప్రతి బాలిక చిన్నతనం నుంచే తమకు ఉన్న హక్కుల గురించి తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకుంటూ సమాజానికి కూడా తెలియపరచాలని ఆమె విద్యార్థినులకు సూచించారు. అదేవిధంగా సూపర్వైజర్లు సరళకుమారి, కవిత పాల్గొని ఈ కార్యక్రమంలో పోషణ మాసం గురించి కూడా తెలియపరచి ప్రతి బాల బాలికలకు సమతుల ఆహారం ఉంటేనే సరైన పోషణ ఉంటుందని, ప్రతి ఒక్కరు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాసరావు, స్థానిక టీచర్లు, మహిళాశక్తి కేంద్రం అధికారిణి సంతోష, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## గీతంలో నైతిక హ్యాకింగ్‌పై నైపుణ్య శిక్షణ



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

**పటాన్‌చెరు, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లోని కృత్రిమ మేధస్సు డేటా సైన్స్ (ఎఐ డిఎస్) విభాగం ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 15వ తేదీవరకు నైతిక హ్యాకింగ్‌పై సాంకేతిక శిక్షణాశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గీతంలోని శిక్షణ, యోగ్యతాభివృద్ధి విభాగం ప్రోత్సాహంతో, న్యూఢిల్లీలోని ఎడ్యు స్కిల్స్ సౌజన్యంతో, ఎఐ డిఎస్ విద్యార్థి విభాగం హ్యాక్ ఆప్స్ క్లబ్ సహకారంతో దీనిని నిర్వహిస్తున్నారు. కోర్ ఇంజనీరింగ్ డీన్, వి.శిరీష నిర్వహణలో డాక్టర్ టి.శశివర్ధన్ ఈమూడు రోజుల కార్యశాలను సమన్వయం చేస్తున్నారు. ఆచరణాత్మక నైపుణ్యాలు, సైబర్‌భద్రత, నైతిక హ్యాకింగ్ పద్ధతులపై విద్యార్థులకు లోతైన అవగాహన కల్పించి, వారిని సన్నద్ధంచేసే లక్ష్యంతో దీనిని నిర్వహిస్తున్నారు.

## చక్రియాల్‌లో సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందచేత

**చౌటకూరు, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చక్రియాలలో గ్రామానికి చెందిన ముగ్గురికి 1లక్ష 37 వేల రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చిన్నరోళ్లపాటి రాజశేఖర్ అందచేశారు. గ్రామానికి చెందిన చంచలిపేట సత్తమ్మకు రూ.55వేలు, బానూరి లక్ష్మయ్యకు రూ.66వేలు, బక్కారెడ్డి ప్రభావతికి రూ.22వేల చెక్కులను పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు తుంగే పండరి, ఆలయకమిటీ మాజీచైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ రోళ్లపాటి సత్యనారాయణ, మన్నె నర్సింలు, నాయకులు తలారి పద్మారావు, అందోలు రాములు, తుంగె అంజయ్య, జంగిలి మల్లయ్య, తుంగె పెద్దపండరి తదితరులు పాల్గొన్నారు.

## డిసి శ్రీనివాస్‌రెడ్డిపై కాలనీవాసులు ఆగ్రహం

**-పార్కు స్థలం ప్రైవేటు వ్యక్తులదని నివేదిక ఇవ్వడంపై ఆక్షేపణ**

**అల్వాల్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
పార్కు స్థలం విషయంలో డిసి ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా నివేదిక ఇవ్వడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అల్వాల్ సర్కిల్ సాయిబాబా కాలనీ వాసులు మీడియా సమావేశం నిర్వహించి డిసి శ్రీనివాస్‌రెడ్డి వ్యవహార శైలి సమంజసంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీకి చెందిన పార్కు స్థలం అన్యాక్రాంతం అవుతోందని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. హైడ్రా కమిషనర్ ఆదేశాలు ప్రకారం 22 జనవరి 2025 రోజున డిసి శ్రీనివాస్‌రెడ్డి పార్కును సందర్శించి పార్కు చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేయించారని తెలిపారు. మరునాడే పల్లా రాహుల్, పల్లా విశ్వేరరావులు భూమి తమదని కాలనీకి ఎటువంటి సంబంధం లేదంటూ హైకోర్టును ఆశ్రయించగా నాలుగు వారాలు స్టే లభించిందన్నారు. ఈస్థలంపై పూర్తి నివేదిక అందించాలని డిసిని న్యాయమూర్తి అదేశించారని వివరించారు. అనంతరం తాము వెళ్ళి డిసిని కలవగా పార్కు కాలనీకి చెందినదే అని ఎటువంటి ఆందోళన అవసరం లేదని తెలిపారన్నారు. రెండురోజులుకే కాలనీవాసులు పేర్కొంటున్న పార్కుస్థలానికి సంబంధించి జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎలో ఎటువంటి రికార్డులు లేవని, పల్లా రాహుల్, పల్లా విశ్వేరరావుల కుటుంబం చేసిన లేవుట్‌లో స్థలం వారిదే అని మార్కు చేసి ఉన్నందున వారికే చెందుతుందని జోనల్ కమీషనర్‌కు డిసి నివేదిక ఇచ్చారని తెలిపారు. కాలనీ అసోసియేషన్ తరుపున ఆర్టీఐ ద్వారా లే అవుట్ అనుమతిపత్రం ఇవ్వమని కోరగా, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎలో లే అవుట్‌కు సంబంధించి ఎటువంటి రికార్డులు లేవని సమాధానం ఇచ్చారన్నారు. పార్కుకు సంబంధించి ఎటువంటి రికార్డులు లేవన్న డిసి శ్రీనివాస్‌రెడ్డి స్థలం పల్లా రాహుల్, పల్లా విశ్వేరరావులదే అని జడ్‌సికి ఏవిధంగా నివేదిక అందించారని వారు ప్రశ్నించారు. డిసిని కలవడానికి పలుమార్లు ప్రయత్నాలు చేసినా ఆయన సమయం కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కాలనీకి డిసి అన్యాయం చేస్తున్నారని ప్రభుత్వ ఆస్తిని కాపాడకపోగా ప్రైవేటు వ్యక్తులకు పత్తాసుపలకడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

# ప్రతి ప్రభుత్వ శాఖలో జవాబుదారీతనం పెరగాలి

**-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**
**-ఇస్నాపూర్ మున్సిపాలిటీలో పౌరసేవాకేంద్రం ప్రారంభం**
**-నూతన మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేకనిధులు**
**-మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ శ్రీదేవి**



కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గంలో నగరీకరణ పెరుగుతున్న నేపథ్యంలో గ్రామపంచాయతీలను అప్‌గ్రేడ్‌చేస్తూ నూతన మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన పౌర సేవాకేంద్రాన్ని మంగళవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ శ్రీదేవితో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి ఏకరూప దుస్తులు పంపిణీచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ, రాబోయేతరాలకు మెరుగైన సౌకర్యాలు, అభివృద్ధితోకూడిన పట్టణాలను అందించాలన్న లక్ష్యంతోనే గ్రామపంచాయతీలను మున్సి పాలిటీలుగా అప్‌గ్రేడ్‌చేయడం జరిగిందని తెలి పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పెద్ద ఎత్తున నిధులతోపాటు సమీకృత అభివృద్ధి మున్సిపాలిటీల ద్వారా సాధ్యం అవుతుందని తెలిపారు. పౌరసేవాకేంద్రాల ద్వారా ప్రజలు నిత్యం ఎదుర్కొనే సమస్యలకు సత్వరమే పరిష్కారం అందించేందుకు వీటిని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వశాఖలో జవాబుదారీతనం పెరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. నూతన మున్సిపాలిటీలకుసైతం నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ శ్రీదేవి మాట్లాడుతూ, పటాన్‌చెరు నియోజకవర్గంలో పరిపాలన సౌలభ్యం, సమీకృత అభివృద్ధి కోసం నూతనంగా ఐదు మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతన మున్సిపాలిటీల అభివృద్ధి కోసం పదిహేనుకోట్ల రూపాయలచొప్పున నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. గ్రామపంచాయతీల కంటే మెరుగైన పరిపాలన, అభివృద్ధి మున్సిపాలిటీల ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన 2047 విజన్ ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రతి పైసాకు అకౌంటబిలిటీ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పౌరసేవాకేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి ఫల్గుణకుమార్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి శ్రీశైలంయాదవ్, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి

**-జిల్లా గ్రంథాలయాలసంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి**

**నర్సాపూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయాలసంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి అన్నారు. నర్సాపూర్‌లోని గ్రంథాలయాన్ని సందర్శించి ఆమె మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయాలసంస్థ చైర్మన్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన తరువాత నర్సాపూర్ గ్రంథాలయానికి ఫర్నిచర్, పుస్తకాలు సమకూర్చినట్లు తెలిపారు. అంతేగాక ఈ గ్రంథాలయానికి ప్రహరీగోడ నిర్మాణంతోపాటు గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఒక రీడింగ్‌రూమ్, మరుగుదొడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. జిల్లాకేంద్రమైన మెదక్‌లో ఉన్న డిజిటల్ గ్రంథాలయం మాదిరిగానే నర్సాపూర్‌లో సైతం డిజిటల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని జిల్లా గ్రంథాలయాలసంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి తెలిపారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**-తహసీల్దార్ బాలలక్ష్మి**



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ బాలలక్ష్మి

**వెల్దుర్తి, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
ఉమ్మడి వెల్దుర్తి మండలంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ బాలలక్ష్మి, పిఎసిఎస్ చైర్మన్ అనంతరెడ్డి, మాసాయిపేట తహసీల్దార్ నానజ్యోతి ఎవో కవిత ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాల్లోనే విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం రైతులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. వెల్దుర్తి మండలంలో బండ ప్రసాద్ పల్లి, మానేపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. అలాగే మాసాపేట మండల కేంద్రమైన మాసాయిపేట, అచ్చంపేట గ్రామాల్లో కొనుగోలుకేంద్రాలను ఏర్పాటుచేశారు. రైతులు ఈకొనుగోలుకేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్‌యాదవ్. దన్‌సింగ్. పీసెస్ డైరెక్టర్ నరసింహులుతోపాటు పలువురు పాల్గొన్నారు.

## సామర్థ్యాలవారీగా బోధన చేపట్టాలి

**-సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వై.వెంకటేశ్వర్లు**
**-పటాన్‌చెరు పట్టణంలో పాఠశాల తనిఖీ**

**పటాన్‌చెరు, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
తరగతిగదిలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను సామర్థ్యాలవారీగా బోధించాలని సంగారెడ్డిజిల్లా విద్యాశాఖాధికారి వై.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని గౌతమ్‌నగర్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా డిఈఓ ఉపాధ్యాయురాలు విక్టోరియా చెబుతున్న వివిధ అంశాలను స్వయంగా దగ్గరుండి పరిశీలనచేశారు. పాఠ్యాంశం బోధన చేసేటప్పుడు టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలకు అక్షయపాత్రద్వారా సరఫరా అవుతున్న మధ్యాహ్నభోజనం కూడా రుచిచూసి సంతృప్తి వ్యక్తపరిచారు. అందరు ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. పాఠశాల ఆవరణలో ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసుకొని రెగ్యులర్‌గా విధులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట మండల విద్యాధికారి నాగేశ్వర్‌నాయక్, ఎంఆర్సి సిబ్బంది విక్టర్, తదితరులు ఉన్నారు.

## అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా శిక్షలు

**-ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి, సంక్షేమ అధికారిణి హేమభార్గవి**




సదస్సులో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి

**నర్సాపూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
బాలికల పట్ల ఎవ్వరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా శిక్షార్హులు అవుతారని నర్సాపూర్ ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి హేమభార్గవి అన్నారు. మంగళవారం జాతీయ, రాష్ట్ర, మెదక్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలమేరకు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమం పురస్కరించుకొని నర్సాపూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది పి.సుధాకర్, ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి హేమభార్గవి, మండల ఎంఈఓ తారాసింగ్, లోక్ అదాలత్ లీగల్ సర్వీస్ న్యాయవాది మధుశ్రీశర్మ, స్వరూపారాణి, రాజునాయక్, సాయికుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత, హబ్ కోఆర్డినేటర్ సంతోష, జెండర్ కోఆర్డినేటర్ కవిత, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన




బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ (తేన), లయన్స్ క్లబ్ ఆఫ్ తెల్లాపూర్ సంయుక్తంగా డాక్టర్ ప్రజ్ఞా చిగురుపాటి గ్రాన్యూల్, ఏఐజి ఆసుపత్రి, యుసి బ్రెస్ట్ ఫౌండేషన్ సహకారంతో కొల్లూరు డబుల్ బెడ్‌రూం హౌజింగ్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని కొల్లూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గణేష్ పటేల్, కమ్యూనిటీ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్య నిపుణులు ప్రారంభించారు. ఆర్థికంగా బలహీనవర్గాల మహిళల్లో ముందస్తుగా గుర్తించడం, సకాలంలో వ్యాధి గురించి తెలుసుకోవడం, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం జరిగింది. 18 ఏళ్లు పైబడిన మహిళలు స్క్రీనింగ్‌లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఏఐజి ఆసుపత్రి, యుసి బ్రెస్ట్ ఫౌండేషన్ నుంచి నిపుణులైన వైద్యులు 200మందికిపైగా మహిళలకు పరీక్షించారు. కమ్యూనిటీ హెల్త్‌కేర్, మహిళల వెల్నెస్ చొరవలకు నిరంతరం నిబద్ధతతో పనిచేస్తున్న డాక్టర్ ప్రజ్ఞా చిగురుపతి, గ్రాన్యూల్స్ ఇండియా, ఏఐజి ఆసుపత్రి, యుసి బ్రెస్ట్ ఫౌండేషన్‌లకు తేన, లయన్స్ క్లబ్ ఆఫ్ తెల్లాపూర్ సభ్యులు, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించాలి

**-నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**



రైతులు పండించిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**కొల్చారం, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర పొందాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి అన్నారు. కొల్చారం మండలంలో మంగళవారం సునీతారెడ్డి సుడిగాలి పర్యటనచేశారు. కొల్చారం మండలంలోని కొంగోడు, నాయిని జలాల్పూర్, పోతిరెడ్డిపల్లి, అంసాన్‌పల్లి, మండలకేంద్రమైన కొల్చారం, వరిగుంతం, పోతంశెట్టిపల్లి, అప్పాజీపల్లి, గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మండలనాయకులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా తూకానికి కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్‌చేసి తూకంపై ధాన్యాన్ని తూకం వేశారు. ఈసందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం రైతులకు రూ.32కోట్ల బోనస్ బకాయి ఉందని, వాటిని వెంటనే రైతులఖాతాలో జమచేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని మద్దతుధర పొందాలని, అధికారులు కొనుగోలుకేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రఫిక్ ఉన్నిసా, మండల పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌరీశంకర్‌గుప్త, యూత్ అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు, బిఆర్ఎస్ నాయకులు ముత్యంగారి సంతోష్‌కుమార్, యూత్ రవితేజరెడ్డి, గల్వ ఇంద్రసేనారెడ్డి, సూరెగారి నరేందర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం ప్రవీణ్ కుమార్, చిట్యాల యాదయ్య, యాదగౌడ్, వేమారెడ్డి, సోమన్న, నర్సింలు, నెల్లికిష్టయ్య, సత్య గౌడ్, వినోద్‌నాయక్, రమేష్, వడ్ల ప్రభాకర్, సొసైటీ చైర్మన్ నాగూరు మనోహర్, మన్నె రాములు, చిన్నారపు ప్రభాకర్, సిఈవోలు పార్తిగారి కృష్ణ, సాయిరెడ్డి, చిన్నారపు రాములు, ఆంజనేయులు, మండల వ్యవసాయాధికారి శ్వేత కుమారి, ఆర్ఐ ప్రభాకర్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సిబ్బంది, ఐకెపిసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## 26న హమాలీ బస్తీలో బొడ్రాయి పండుగ

**కంటోన్మెంట్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
ఈ నెల 26న పద్మారావు నగర్‌లోని హమాలీ బస్తీలో బొడ్రాయి పండుగ నిర్వహించనున్నట్లు, ఈ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ హమాలీ బస్తీ పెద్దలు పద్మారావునగర్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం మారేడ్‌పల్లిల్లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ బస్తీ నాయకులు సంపత్, కుషాల్, సత్యనారాయణ, నర్సింగ్, కాంతారావు, దుర్గా, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## జయహో జలాది వెబ్‌సైట్‌ను ప్రారంభించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు

**సంజీవరెడ్డినగర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
జయహో జలాది యూత్‌సేవాసంస్థ అమీర్‌పేటలోని జిజ్ఞాస స్టూడియోలో యువతీయువకులకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు కెరీర్ గైడెన్స్, శిక్షణా కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రిటైర్డ్ ఐఎఎస్ డాక్టర్ ఎస్. చెల్లప్పా, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి దినకర్‌బాబులు కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, జయహో జలాది వెబ్‌సైట్‌లో యువతీయువకులు, నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేయించుకోవడం ద్వారా ఉచితంగా ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని సంస్థ వ్యవస్థాపకులు జలాది రత్న సుధీర్ తెలిపారు. కార్యక్రమంలో నందిగామ్ నవీన్, వివిఎన్.దిలీప్, తుమ్మలపల్లి రవిచంద్ర, శ్రీనివాస్, యువతీయువకులు పాల్గొన్నారు.

## బిసి సంఘాల బంద్‌కు తెలుగుదేశం మద్దతు

**ముషీరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
ఈనెల 18వ తేదీ బిసి సంఘాల ఐక్యవేదిక జెఏసి నిర్వహించ తలపెట్టిన బంద్‌కు తెలుగుదేశంపార్టీ సంపూర్ణమద్దతు తెలియచేస్తున్నామని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్‌కుమార్‌గౌడ్ స్పష్టంచేశారు. మంగళవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని తెలుగుదేశం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రధానలక్ష్యం బలహీన వర్గాల సంక్షేమేనని గుర్తుచేశారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలను చైతన్యపరుస్తూ రాజ్యాధికారం కల్పించే దిశగా కృషిచేస్తూనే ఉంటారని అన్నారు. కాంగ్రెస్‌కు నిజంగా బిసిల పట్ల చిత్తశుద్ధి ఉంటే స్థానిక ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్లు కల్పించి, నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. బిసిలను అడ్డుపెట్టుకుని రాజకీయలబ్ధి పొందాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. బిసిలు దేశానికే వెన్నెముకవంటి వారని గుర్తించిన పార్టీ తెలుగుదేశంపార్టీ అని, బలహీనవర్గాలకు సమాజంలో సమున్నత స్థానం కల్పించి, వారి అభివృద్ధికి కృషి చేస్తున్న పార్టీ తెలుగుదేశం ఒక్కటేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా, నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, శుక్రవేది, యాదగిరి పాల్గొన్నారు.

## వర్షంనీరు సాఫీగా వెళ్లేలా పనులు

**గన్‌ఫౌండ్రి, అక్టోబర్ 14ప్రభాతవార్త:**
పెరుగుతున్న జనాభా అనుగుణంగా పైపులైన్ పనులను ఆధునీకరించడం జరుగుతుందని, దీనికితోడు భారీవర్షాలు కురిసిన సమయంలో సాఫీగావెళ్లేందుకు ప్రత్యేకపనులను చేపట్టడం జరుగుతుందని గన్‌ఫౌండ్రి డివిజన్ బిజెపి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌బిస్వా అన్నారు. ఈ మేరకు డివిజన్‌పరిధిలోని నేతాజీనగర్‌లో సుదీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకుగాను ఈపనులు చేపట్టడం జరుగుతుందన్నారు. నేతాజీనగర్‌లో అభివృద్ధిపనులను డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ బిస్వా పనులను ప్రారంభించారు. ఈపనులు పూర్తయితే, మున్ముందు ఎలాంటి డ్రైనేజీ సమస్యకాని, వరదనీటి సమస్యకాని ఉత్పన్నం కాదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బిజెపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వా తదితరులు పాల్గొన్నారు.

## టపాసు విక్రయాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి

**బేగంబజార్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
ఇటీవల నగర పోలీసుకమిషనర్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన సజ్జనార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందచేశారు. దీపావళి పండుగను పురస్కరించుకుని బాణాసంచా అమ్మకాలుచేసే దుకాణాదారులు పోలీసులు సూచించే నియమ, నిబంధనలను పాటించాలని, పోలీసుల అనుమతి తీసుకోవాలని సుల్తాన్‌బజార్ ఇన్స్‌పెక్టర్ కె.నరసింహ అన్నారు. ఆయన మాట్లాడుతూ బాణాసంచా విక్రయాల నేపథ్యంలో టపాసులు విక్రయాలుచేసే దుకాణాదారులు అగ్నిప్రమాదాలు జరగకుండా అవసరమైన జాగ్రతలు తీసుకోవాలన్నారు. అనుకోకుండా ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే వెంటనే మంటలను ఆర్పివేసేందుకుగాను, అవసరమైన ఫైర్‌సేఫ్టీ పరికరాలు, రెండు డ్రమ్ములలో నీళ్లు, ఇసుక బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అనుమతి మేరకు దుకాణాలలో టపాసులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసులు, ఫైర్‌విభాగం నుంచి అనుమతులు లేకుండా అమ్మకాలుచేస్తే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు.

## బిసిల రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంపూర్ణ మద్దతు

**-ముదిరాజ్ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డా.గుండ్లపల్లి శ్రీనివాస్**

**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
స్థానికల సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించిన జీవో9ను వ్యతిరేకిస్తూ చేస్తున్న కార్యక్రమాలను ఖండిస్తు బిసి జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 18న రాష్ట్రబంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ముదిరాజ్‌సంఘాల ఐక్యవేదికకన్వీనర్ డా.గుండ్లపల్లి శ్రీనివాస్‌ముదిరాజ్ తెలిపారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు అల్లుడు జగన్‌ముదిరాజ్‌తో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లకు సంబంధించిన జివో9ని ఐక్యవేదిక స్వాగతిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ముండుగ బాలు ముదిరాజ్, బొళ్ల వెంకట్‌ముదిరాజ్, శ్రీనివాస్‌ముదిరాజ్, అంబర్‌పేట్ సతీష్‌ముదిరాజ్, దమ్మిగారి కనకయ్య, కటికల బిక్షపతి, పిట్టల పరుశురాం, మల్లబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఈఓ మధుకర్‌నాయక్ సేవలు ఎనలేనివి

**కంటోన్మెంట్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
కంటోన్మెంట్ బోర్డు సిఈఓగా పనిచేస్తున్న మధుకర్ నాయక్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన సేవలను కంటోన్మెంట్‌లో చిరస్థాయిగా నిలుస్తాయని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. బోర్డు సిఈఓగా మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న మధుకర్ నాయక్ పదోన్నతిపై ఢిల్లీ కంటోన్మెంట్ డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ అవుతున్న సందర్భంగా బోర్డు మాజీ సభ్యులు అభినందనలు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE, SANGAREDDY DISTRICT COURT
G.W.O.P: 29 OF 2025

BETWEEN :
Smt. ALLURI LAVANYA ...Petitioner
AND
The Sub- Registrar and others ...Respondents
To,
1. All Concerned ...Respondents

NOTICE

Please take notice that the Petitioner have filed the above G.W.O.P No: 29of 2025 for the declaration of the guardian ship for her minor sons A. Prajay and A.Madhu, against the Respondents before the Hon'ble Principal District and Session judge court, Sangareddy District at Sangareddy. The Hon'ble court was pleased to Order for substituted service through this Vaarthanews paper for the appearance of the above 8th Respondents on the 28.10.2025. at 10.30am. If the said Respondents fails to appear before the Hon'ble court on the above said date and time, the matter will be decided in their absence as per law.

//By order of the Hon'ble court//
T.Anilkumar, Kiran.KT, KVM. Kumar, Surya Parveda, B.M.Mohan
CHEYOOTHA ADVOCATES AND ASSOCIATES.
LIG-609, BHEL, R.C.PURAM-502032,TG
@7382758844, 7382738844.



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

## ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నవభారత్ విద్యార్థి

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 14, ప్రభాతవార్త :** పట్టణంలోని నవ భారత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 6వ తరగతి విద్యార్థి షాన్వి ఇటీవల మెదక్‌లో జరిగిన ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైందని ఆ పాఠశాల కరస్పాండెంట్ గంగరవేని రవి తెలిపారు. జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైన షాన్విని మంగళవారం పాఠశాలలో అధ్యాపకులతో కలిసి సత్క రించారు. షాన్వీ రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపి వారి తల్లితండ్రులతో పాటు పాఠశాల మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌తో పాటు అధ్యాపకులు ఉన్నారు.

## 'కాంగ్రెస్ సర్కార్ మోసాలను ప్రజలకు వివరిస్తాం'



ఆటో కార్మికుల బాకీ కార్డు గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, అక్టోబరు 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ఆటో కార్మికుల బతుకులు దుర్భరమయ్యాయని సిద్దిపేట ఆటో క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ గౌరవాధ్యక్షుడు పాల సాయి రాం అన్నారు. సిద్దిపేట ఆటో క్రెడిట్ కో-అపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు బాకీ కార్డు, గోడ పత్రికను ఆవిష్కరించి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఆటోల బాకీ కార్డు స్టిక్కర్ వేసుకొనితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు కాంగ్రెస్ సర్కార్ బాకిపడిందన్నారు. ఆటో కార్మికులకు బాకీ ఉన్న రూ.24 వేలు వెంటనే చెల్లించాలన్నారు. ఆటో కార్మికుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ సర్కారే కారణమన్నారు. కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై అవగహన సదస్సు



ఆయిల్ ఫామ్ సాగుపై అవగహన కల్పిస్తున్న దృశ్యం

**రాయపోల్, అక్టోబరు 14 ప్రభాతవార్త :** ఆయిల్ ఫామ్ పంట సాగుతో రైతులు అధికలాభాలు పొందవచ్చని గజ్వేల్ ఏడిఏ బాబునాయక్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం మంతూర్ గ్రామానికి చెందిన రైతు నాచగిరి సాగు చేసిన ఆయిల్ ఫామ్ తోటను రైతులతో కలిసి సందర్శించి అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మంతూర్ గ్రామానికి చెందిన రైతు నాచగిరి 3.20 ఎకరాలలో పంట సాగు చేసాడని, 6 నెలల్లో సుమారుగా 1,85,00 రూపాయల ఆదాయాన్ని పొందాడని అన్నారు. మిగతా పంటలతో పోల్చుకుంటే ఆయిల్‌ఫామ్ పంటకు పెట్టుబడి తక్కువని తెలిపారు. ఆయిల్‌ఫామ్ పంటలో నాలుగు సంవత్సరాల వరకు అంతర పంటలు కూడా సాగు చేసుకొవచ్చని, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేష్,ప్లాంట్ మానిటరింగ్ ఆఫీసర్ రాములు,ఏఈవో ప్రవీణ్,ఫీల్డ్ అసిస్టెంట్ రాకేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నగదు రహిత లావాదేవీలపై అవగాహన




అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

**వర్గల్, అక్టోబరు 14 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని అనంతగిరిపల్లి గ్రామంలో మంగళవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీ లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న సిసి సాయిలు మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. నగదు రహిత లావాదేవీలతో సమయం ఆదా కావడమే కాకుండా ప్రతి మహిళకు సంఘంలోని సభ్యులు చెల్లించిన లావాదేవీలు కనిపిస్తాయన్నారు. నగదు దొంగతనానికి గురికా కుండా ఉంటుందని, ఇంటి నుంచే ఖాతాలో జమ చేయవచ్చని అన్నారు. ప్రతి మహిళ నగదు రహిత లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు అనురాధ, వివోఏ శృతి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీరామరక్ష స్తోత్రం పుస్తకావిష్కరణ

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 14 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరామరక్ష స్తోత్రం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రిన్సిపల్ జ్యుడీషియల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిగౌడ్, అఖిల భారత సమరసతా కళావిభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్‌బాబుల చేతులమీదుగా శ్రీరామరక్ష స్తోత్రం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీ రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో రామరాజు చేస్తున్న సేవలను కొనియాడారు.




శ్రీరామరక్ష స్తోత్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

**ఎంఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్**



మాట్లాడుతున్న మాదాసు శ్రీనివాస్

**గజ్వేల్, అక్టోబరు 14 (ప్రభాతవార్త):** పంట కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని,వెంటనే ప్రారంభించాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో పంట సరైన దిగుబడి రాక బాధపడుతున్న రైతులు ధాన్యాన్ని విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలు లేక బహి రంగ మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో తీవ్రం గా నష్టపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నలకు క్వింటాలుకు రూ.2400 మద్దతు ధర నిర్ణయించినప్పటికీ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవ డంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించి రూ.400 నుంచి రూ.500 వరకు నష్టపోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి రైతుల పట్ల, వ్యవసాయం పట్ల ప్రాధాన్యత లేదని అన్నారు. రైతులు ఒకవైపు యూరియా కోసం పడరాని పాట్లు పడిన రోజులు మరువక ముందే మరోవైపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక ప్రభుత్వం రైతుల ఉసురు పోసు కుంటుందన్నారు. ప్రభుత్వానికి రైతుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే కొనుగోలు కేం ద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర అందించి కొను గోలు చేయాలని అన్నారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్య దర్శి రమేష్‌గౌడ్, నాయకులు ఉమర్, శివకుమార్, నిజామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్

## నారాయణఖేడ్‌లో "సంఘటన్ సృజన్ అభియాన్"

**నారాయణఖేడ్, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లో నిర్వహించిన "సంఘటన్ సృజన్ అభియాన్" కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంటు సభ్యుడు సురేష్‌కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆదేశాలమేరకు దేశంలో మొదటిసారిగా, రాజకీయాల్లో ఎప్పుడూ చూడ నట్లుగా కాంగ్రెస్ పార్టీ పారదర్శకంగా జిల్లా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియను చేపట్టిందన్నారు. "కార్యకర్తల అభిప్రాయాలను నేరుగా సేకరించి అధ్యక్షుడిని ఎంపిక చేయడం గొప్ప విషయం. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి అవకాశం ఉంటుంది," అని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను సమర్థంగా నిర్వహించేందుకు ప్రతి జిల్లాకు ఓ అబ్జర్వర్, ఇంచార్జిలను నియ మించారని తెలిపారు. సంగారెడ్డి జిల్లా అభ్యర్థిత్వ పరిశీలన కోసం ఏఐసీసీ సెక్రటరి శారిట లైట్‌ఫ్లాంగ్ గారిని అబ్జర్వర్‌గా నియమించారనీ, ఆమె ప్రత్యేకం గా జిల్లాకు వచ్చినట్టు ఎంపీ వివరించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు, ఉమ్మడి జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నాగేష్ శెట్కార్, డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు శ్రీనివాస్, శంకరయ్యస్వామి, మండల్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు తదితర ప్రముఖ నేతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం ఆపండి



మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబరు 14, ప్రభాతవార్త:** సంగారెడ్డి ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్‌పై కొన్ని సామాజిక మాధ్య మాల్లో నిరాధారమైన తప్పుడు ప్రచారాలను టిఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు ఖండించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ మండల, పట్టణ అధ్యక్షులు మీడియాతో మాట్లాడారు. సమావేశంలో మండల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, మ్యాకం విఠల్, కొత్తపల్లి చక్రపాణి, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ నిత్యం ప్రజల మధ్యనే ఉండే ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పై నిరాదారమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంపై రాష్ట్ర డిజిపిని కలుస్తామని వారు తెలిపారు.కార్యక్రమంలో విఠల్, సలువుద్దీన్, అజయ్, పరుశరామ్ తదితరులు ఉన్నారు.

## వాలీబాల్ పోటీలు ప్రారంభం

**రామచంద్రాపురం, అక్టోబరు 14, ప్రభాతవార్త:** కమ్యూనిటి సెంటర్ ఆధ్వ ర్యంలో ఆల్ ఇండియా బిహెచ్‌ఈఎల్ ఇంటర్ యూనిట్ వాలీబాల్ పోటీలు మంగళవారం ప్రారంభించారు. 14వ తేదీన ప్రారంభమైన వాలీబాల్ పోటీలు ఈనెల 16వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రామచంద్రాపురంలోని సిసి గ్రౌండ్‌లో జరిగిన మాస్ అసెంబ్లీలో పాల్గొన్న క్రీడాకారులు ప్రతిజ్ఞతోఉ త్సాహంగా ప్రారంభించారు. కార్యక్రమంలో బిహెచ్‌ఈఎల్ అధికారులు కెబి రాజా, వై శ్రీని వాస్, టి.నందు, డాక్టర్ సంధ్యాకర్, ఎస్‌డివి కృష్ణంరాజు, కొండారెడ్డి, బి సురన్ ప్రసాద్, డి శ్రీకాంత్, కె.రవీందర్ పాల్గొని క్రీడాకారులకు ఆల్‌ద బెస్ట్ చెప్పారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునితారెడ్డి

## మంత్రి పొన్నం వ్యాఖ్యలు సరైనవికావు ఎమ్మెల్యే సునితారెడ్డి

**కొల్చారం, అక్టోబరు 14(ప్రభాతవార్త):** మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు మహిళలను కించ పరిచే విధంగా వున్నాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతంలో ఆమె మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత కార్యకర్తల సమా వేశంలో మాట్లాడుతూ భర్త గోపీనాథ్ తలుచుకొని కంటతడి పెట్టి భావోగ్వేదా నికి గురికావడం జరిగిందని దానిపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వాఖ్యలు సరి అయినవి కాదని మహిళలను కించపరిచే విధంగా ఉందని ఆ వాఖ్యలను బెషరతుగా వెనక్కి తీసుకోవాలని సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు.

## పీపడ్‌పల్లికి నైట్ హాల్ట్ బస్సును పునరుద్దరించండి

**-డయల్ యువర్ డిఎంకు గ్రామస్థుల వినతి**

**జహీరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** రాయికోడ్ మండల పరిధిలోని పీపడ్‌పల్లి గ్రామానికి 40 సంవత్సరాలుగా నడిచి ఇటీవల నిలిపేసిన నైట్ హాల్ట్ బస్సును పునరుద్దరించాలంటూ మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డిఎంలో గ్రామస్థులు వినతి చేశారు. పీపడ్‌పల్లికి 40 సంవత్సరా లుగా 5 ట్రిప్పులు బస్సును నడిపిం చారని, కరోనా సమయంలో గ్రామంలో నైట్ హాల్ట్ అయ్యే బస్సును ఆర్టీసి అధికారులు రద్దు చేశారిన గ్రామస్థులు డయల్ యువర్ డిఎంలో ఫోన్ చేసి వివరించారు.గ్రామానికి సాయంత్రం 5 గంటల తరువాత బస్సు సౌకర్యం లేదని, పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తమ స్వగ్రామానికి చేరు కునేలా అని ప్రశ్నించారు. గ్రామంలో నైట్‌హాల్ బస్సును పునరుద్దరించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

## ఆర్థిక సాయం అందజేత

చిన్నశంకరంపేట,అక్టోబర్ 14,ప్రభాతవార్త: మండల పరిధి కొండాపూర్ గ్రామానికి చెందిన సాయిబాబా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఈ విషయం తెలుసుకున్న మాజీ జడ్పిటిసి పట్లోరి మాధవి ఐదువేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు పంపగా స్థానిక నాయకులు అందించారు. కార్యక్రమంలో శంకర్ గౌడ్ సిద్ధిరాములు వెంకట్ రాములు శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## సరాప్‌పల్లిలో మోటారు బైక్ చోరీ

**చౌటకూరు, అక్టోబరు 14, ప్రభాతవార్త :** మండల పరిధిలోని సరాఫ్ పల్లిలో సోమవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన మన్నె సుధాకర్‌కు చెందిన మోటారు బైక్ (ఏపి 23ఏడి 0120)ను ఇంటి వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. మంగళవారం ఉదయం చూడగా బైక్ కనిపించలేదు. బైక్‌ను తీసుకుపోతున్నట్లు సిసి కెమెరాల్లో నమో దైంది.బాధితుడు సుధాకర్ పుల్‌కల్ పోలసు ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**చిన్నశంకరంపేట, అక్టోబరు 14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మిర్జా పల్లిలో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సీసీ యశోద ప్రారంభించారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సమైక్య, సభ్యులు రైతులు పాల్గొన్నారు.



మిర్జాపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీసీ యశోధ

# గజ్వేల్‌లో అడ్డగోలుగా మైక్రో ఫైనాన్స్‌లు

- ◆ మైక్రో ఫైనాన్స్‌ల వేధింపులతో గతంలో జరిగిన ఆత్మహత్యలు
- ◆ ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్‌లను, ప్రైవేట్ ఫైనాన్స్‌లను నిషేధించాలి

**గజ్వేల్, అక్టోబరు 13 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అడ్డ గోలుగా మైక్రో ఫైనాన్స్‌లు, ప్రైవేట్ ఫైనాన్స్‌లు దర్శనమిస్తున్నాయి. లాభార్జనే ధ్యేయంగా వడ్డీ వ్యాపారాలు చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలను అప్పుల ఊబిలోకి లాగుతున్నారు. రోజు రోజుకు వసూళ్లు, వారానికోసారి వసూళ్ల పేరుతో పదిమంది మహిళలను గ్రూపుగా ఏర్పాటుచేసి ఎలాంటి తనఖ లేకుండా అధిక వడ్డీతో ఒక్కొక్కరికి రూ.60వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు ఇస్తూ వసూలు చేస్తున్నారు. పదిమంది మహిళల్లో ఏ ఒక్క మహిళ తీసుకున్న రుణం చెల్లించకపోతే తొమ్మిది మంది మహిళలు రుణం చెల్లించనివారి ఇంటికి వెళ్లి ఇబ్బం దులకు గురిచేస్తున్నారు. పది సంవత్సరాల క్రితం గజ్వేల్ పట్టణంలో మైక్రో ఫైనాన్స్‌ల వేధింపుల వల్ల అనేక మంది యువకులు ఆత్మహత్యలు చేసు కున్నారని, అలాగే గతంలో రైతులకు పంటలు సరిగ్గా పండకపోవడంతో మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్ర యించి విపరీతంగా అప్పులుచేసి ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మైక్రో ఫైనాన్స్‌ల వల్ల రాష్ట్రంలో చాలా మంది బలయ్యారని, రాష్ట్రంలో ఏ ఒక్క మైక్రో ఫైనాన్స్ సంస్థలు ఉండవద్దని అప్పటి ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్‌లను రద్దు చేశారు. అప్పటి నుండి సుమారు 10 సంవత్సరాల వరకు గజ్వేల్ పట్టణం లో ఏ ఒక్క మైక్రో ఫైనాన్స్ లేకుండా పోయాయి. ప్రస్తుతం మైక్రో ఫైనాన్స్‌లు అడ్డగోలుగా విస్తరిం చడంతో పేద మహిళలు, మధ్యతరగతి ప్రజలు మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయించి అప్పులు చేస్తు న్నారు. తెలంగాణరాష్ట్రం ఏర్పడిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం, వ్యాపారాలు అభివృద్ధి చెందగా, రైతులకు పంటలు పుష్కలంగా పండాయి. గత రెండున్నర సంవత్సరాలుగా రైతులకు సరైన పం టలు పండక, రియల్ ఎస్టేట్, వ్యాపార రంగాలు కుదేలు కావడంతో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అను మతి లేకుండా సుమారు 100 ప్రైవేట్ ఫైనాన్స్‌ల తో పాటు సుమారు 30 వరకు మైక్రో ఫైనాన్స్‌లు యధేశ్చగా నడుస్తున్నాయి. ఒకటి రెండుసార్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులుచేసి తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసినా ఫైనాన్స్‌ల ఆగడాలను అరికట్టలేకపోయారు.

పూర్తిస్థాయిలో ప్రైవేట్, మైక్రో ఫైనాన్స్‌లపై ప్రభుత్వం దృష్టి సారించాలని, రానున్న రోజుల్లో మైక్రో ఫైనాన్స్‌ల వేధింపులతో మరోసారి యువత బలయ్యే అవకాశాలు ఉన్నాయి. గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి గతంలో మైక్రో ఫైనాన్స్‌ల వేధింపుల వల్ల ఆత్మహత్యకు పాల్పడగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గజ్వేల్‌కు వచ్చి పరామర్శిం చడం జరిగిందని, ఈ క్రమంలో మైక్రో ఫైనాన్స్ లను నిషేధించారని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మైక్రో ఫైనాన్స్‌లకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



మాట్లాడుతున్న సిఐ దుర్గ

## మానవ తప్పిదం వల్లే సైబర్‌నేరాలు : సిఐ దుర్గ

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 14, ప్రభాతవార్త :** సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందని సిద్దిపేట మహిళా పోలీసుస్టేషన్ సిఐ దుర్గ అన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడక ఎంజిపిటిబిసిఆర్‌ఎస్ రెసిడెన్షియల్ విద్యార్థులకు మంగళవారం మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఇవిటీజింగ్, ఫోక్సో, షీటీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు నూతన చట్టాలు తదితర అంశాలపై రూరల్ ఎస్ఐ రాజేష్, షీటీమ్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల న్నారు. గంజాయి, డ్రగ్స్‌లాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లి భవిష్యత్ నాశనం చేసుకొవద్దని చెప్పారు. మానవ తప్పిదం వలనే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కాల్‌చేసి తక్షణ పోలీసు సహాయం పొందాలన్నారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా 112, 1098, షీటీమ్ వాట్సాప్ నంబరు 8712667343, పోలీసు స్టేషన్ నంబరు 8712667435 కాల్ చేయాల న్నారు. అవగాహన సదస్సులో ప్రిన్సిపల్ మాధవి, ఉపాధ్యాయులు, షీటీమ్ బృందం ఎఎస్ఐ కిషన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, అక్టోబరు 14 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన బ్యాగరి బాలకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా విషయం తెలుసుకున్న బిఆర్‌ఎస్ పార్టీ బిసిసెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్యముదిరాజ్ మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతోపాటు సోమ వెంకటేష్, దేవరాయ శేఖర్, ముమ్మడి దొడ్డాచారి, కొట్టాల మహేష్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా శ్రీసీతారాముల కళ్యాణం

**మర్కుక్, అక్టోబరు 14 (ప్రభాతవార్త):** పునర్వసు నక్షత్రం సందర్భంగా మండల పరిధిలోని పాములపర్తిలో గల రామాలయంలో మంగళవారం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని మాజీ జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం దంపతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు కళ్యాణం నిర్వహించి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి నెలా పునర్వసు నక్షత్రం సందర్భంగా రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచారం మాజీ చైర్మన్ హరిపంతులు, ఆలయ అర్చకులు అనీష్ త్రిపాఠి, భక్తులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

## జోగిపేటలో అంబేద్కర్ దీక్షా దివస్




దీక్షాదివస్‌లో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

**జోగిపేట, అక్టోబరు 14, ప్రభాతవార్త:** దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవవారం అంబేద్కర్ దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జోగి పేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిం చారు. అనంతరం దళితసంఘాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించినరోజు ఈరోజు అని, అందుకే ఈ దీక్షా దివస్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. అందుకని బౌద్ధ విగ్రహ స్థాపనకు మనమంతా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన దళిత సంఘాలన నాయకులు పాల్గొన్నారు.

## పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 14 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం వేలూరు గ్రామంలో 20 సంవత్సరాలలో 51 మంది ఆత్మహత్య చేసుకోగా, అందు లో 44 మంది రైతులు, 20 మంది యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు, 12 మంది దళిత సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారని ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త పులి రాజు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ వేలూరు గ్రామంలో జరిగిన ఆత్మహత్యలపై చలించిన తాను నేరుగా ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాల వద్దకు వెళ్ళి ఆత్మ హత్య చేసుకోవడానికిగల కారణాలను విశ్లేషించి దానికి అక్షర రూపం దాల్చి నట్లు తెలిపారు. యదార్థ ఘటనలను రాసిన 'వేలూరు ఆత్మహత్యల గోస' అనే పుస్తకాన్ని ఈనెల 16వ తేదీన మధ్యాహ్నం గజ్వేల్‌లోని మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ వీరేందర్, కార్గిల్ యుద్ధ వ్యూహ కర్త డాక్టర్ జిజె.రావు, గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెద్దిరాజుతోపాటు వేలూరు ఆత్మహత్య బాధిత కుటుంబాల చేతుల మీదుగా ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. రైతులు, సాహిత్య అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## బంద్‌కు సిపిఐ మద్దతు : సయ్యద్ జలాలుద్దీన్

**జహీరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** బిసిలకు 42 శాతం రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పిస్తూ విడుదల చేసిన జిఓను హైకోర్టు స్టే ఇవ్వ డం పట్ల బిసి సంఘాలు ఈ నెల 18వ తేదీన తలపెట్టిన బంద్‌కు సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ పేర్కొన్నారు. రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రజలు కోరు తున్న సందర్భంగా బిసి రిజర్వేషన్‌లపై హైకోర్టు స్టేఇవ్వడం తగదని జలా లుద్దీన్ అన్నారు. 18న నిర్వహించే బంద్‌కు సిపిఐ శ్రేణులు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ బంద్‌లో పాల్గొనాలని జిల్లా ప్రజలకు సూచించారు.

## ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించిన మహా పాదయాత్ర

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబరు 14, ప్రభాతవార్త:** సంగారెడ్డి నుండి శబరిమలైకు ఈనెల 6న చేపట్టిన మహా పాదయాత్ర మంగళవారం తెలం గాణ దాటి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించింది. సంగారెడ్డి నుండి తిరుపతి, కాణిపాకం అరుణాచలం మీదుగా శబరిమల సన్నిదానం వరకు సాగే మహా పాదయాత్రలో రోజు 35 కిలోమీటర్ల చొప్పున మొత్తం 1600 కిలోమీటర్లు పాదయాత్ర సాగనుందని గురు స్వామి సాహితి రాము తెలిపారు.

## పేదలకు సాయం చేసేందుకు కృషి చేస్తా : ఎమ్మెల్యే

**కొల్చారం, అక్టోబరు 14(ప్రభాతవార్త):** పేదలకు ఆర్థిక సాయం అందిం చేందుకు కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి అన్నారు. కొల్చా రం మండలానికి చెందిన ఎర్రోళ్ల మమతకు ప్రభుత్వం నుండి మంజూరైన రూ. 36,000 చెక్కును బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం ఉదయం నర్సాపూర్ పట్టణ క్యాంపు కార్యాలయంలో లబ్దిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యేసునితారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కోనాపూరన సంతోష్‌రావు,బిఆర్‌ఎస్ నాయకులు,తదితరులు వున్నారు.

## బాధిత కుటుంబాలకు నవీన్‌గుప్తా ఆర్థికసాయం

**శివ్వంపేట, అక్టోబరు 14, ప్రభాతవార్త :**

మండలంలోని పలు బాధిత కుటుంబాలకు శివ్వంపేట కాంగ్రెస్ సీని యర్ నాయకులు పులిమామిడి నవీన్‌గుప్తా ఆర్థికసాయం అందజేసి అండ గా నిలిచారు. బిక్యతండాలోని సీత్యతండాకు చెందిన మునావత్ రాములు మృతిచెందగా వారి కుటుంబానికి రూ. 5వేలు, బిక్యతండాకు చెందిన ధనావత్ ధన్‌సింగ్ మృతి చెందగా వారి కుటుంబానికి రూ. 5వేలు, చిన్నగొట్టిముక్లలో మన్నె సత్తయ్య మృతి చెందగా వారి కుటుంబానికి రూ. 5వేలు, మొత్తం రూ. 15వేల ఆర్థికసాయం అందజేసి మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిక్యతండా, సీత్యతండా, చిన్నగొట్టిముక్ల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మానవ తప్పిదాల వల్లే సైబర్ నేరాలు

-హుస్నాబాద్ ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
మానవ తప్పిదాల వల్లే సైబర్ నేరాలు జరుగుతున్నాయని హుస్నాబాద్ ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారంరాత్రి మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో పోలీస్ కళాబృందంతో ప్రజలను చైతన్యం చేసేందుకు కనువిప్పు కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిలోని ఆశ, భయం లాంటి తప్పిదాల వల్లనే ఎక్కువ నేరాలు జరుగుతున్నాయన్నారు. బ్యాంక్ అధికారులు ఎవరూ ఫోన్ చేసి బ్యాంకు వివరాలు, ఓటిపిలు అడగరని ఒకవేళ అలాంటి ఫోన్లు ఎవరికి వచ్చినా స్పందించవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. యువత గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు, యువత నడవడికపై వారి తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ వాడాలని, మద్యంసేవించి ఎట్టిపరిస్థితిలో వాహనాలు పడపవద్దన్నారు. ప్రతి గ్రామంలో సిసి కెమేరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలు మంత్రాలు, తంత్రాలు అని మూఢనమ్మకాలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులతో పాటు తదితరులు ఉన్నారు.

## మొక్కజొన్న కొనుగోలుకేంద్రాలు ప్రారంభించాలి

-బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జీ రవిందర్‌గౌడ్



మాట్లాడుతున్న రవిందర్‌గౌడ్

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. అక్కడ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించని కారణంగా రైతులు కష్టపడి పండించిన పంటను దళారులకు తక్కువ ధరలకు విక్రయించుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారని వాపోయారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే తప్ప రైతులకు మద్దతుధర పొందే అవకాశం కనిపి ంచడం లేదన్నారు. నిబంధనలప్రకారం లైసెన్స్‌గల ట్రేడర్లు మాత్రమే వ్యవసాయ మార్కెట్ యార్డులో పంటలు కొనుగోలు చేయాల్సి ఉండగా పట్టణకేంద్రంలో కొంతమంది షటర్లు కిరాయికి తీసుకుని మరీ తక్కువ ధరలకు కొనుగోలుచేస్తూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని మండి పడ్డారు. ఈవిషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవచూపి మొక్క జొన్న కేంద్రాలతోపాటు సిసిఐ కేంద్రాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు, జిల్లా నాయకులు ఎనగందుల శంకర్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## పంచాయతీలో రికార్డులను పరిశీలించిన డిపిఓ



పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డిపిఓ సాయిబాబా

**కంది, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని వడ్డెనగూడతండా పంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి టి.సాయిబాబా సందర్శించి పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. తండాలోని ప్రాథమిక పాఠశాల, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతివనం, తెలంగాణ క్రీడాప్రాంగణాన్ని, ఇజిస్ నిధులతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనాన్ని సాయిబాబా పరిశీలించారు. గ్రామం పరిశుభ్రంగా ఉండేలా చర్యలుతీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో మండలపంచాయతీ అధికారి మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్‌పోజర్ విజిట్ చేసిన సిర్గాపూర్ విద్యార్థులు



ఎక్స్‌పోజర్ విజిట్ చేస్తున్న సిర్గాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

**సిర్గాపూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన సిర్గాపూర్‌లోని ఉన్నతపాఠశాల విద్యార్థులను ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా ఎక్స్‌పోజర్ విజిట్ చేయించారు. గ్రామంలోని పోస్టాఫీసు, ఎస్‌బిఐ బ్యాంక్‌లకు విద్యార్థులను తీసుకుపోయి పౌరులకు అందుతున్న సేవలు, సౌకర్యాలపై వివరించారు. పోస్ట్‌మాస్టర్ కవిత భారత పోస్టల్ సేవల గురంచి విద్యార్థులకు వివరించారు. ఎస్‌బిఐ బ్యాంక్‌లో బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు బ్యాంక్ పనితీరును విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్, ఉపాధ్యాయులు వరప్రకాష్, సచిన్, రవికుమార్, 8,9వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకులంలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**పుల్‌కల్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని సింగూరు గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆగమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ విద్యార్థులకు షార్ట్‌హ్యాండ్, ఓఎం, జిఎఫ్‌సి బోధించేందుకు అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 9,10తరగతుల విద్యార్థులకు సాంఘికశాస్త్రం బోధించేందుకు ఎంఎ బిఈడి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తివివరాలకు సింగూరు గురుకుల బాలుర పాఠశాల 9704550246లో సంప్రతించాలని ప్రిన్సిపాల్ ఆగమయ్య పేర్కొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకదృష్టి సారించాలి

-టిజిఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి



జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతున్న నిర్మలా జగ్గారెడ్డి

**కొండాపూర్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని టిజిఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని అలియాబాద్, తొగరుపల్లి గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం హామీ మేరకు అలియాబాద్ గ్రామంలో అసంపూర్తిగా ఉన్నటువంటి డబల్ బెడ్‌రూమ్ ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసి, ప్లాట్ల పట్టా సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల పట్టాలు మంజూరు చేసి వారికి న్యాయం చేయాలని అన్నారు. అలాగే తొగరుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నూతనభవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. ప్రస్తుతం పాఠశాల భవనం పాడుబడిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించి రైతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రతినిధుల వినతిపత్రాన్ని స్వీకరించి, సంబంధితశాఖల అధికారులతో చర్చించి తగినచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆత్మకమిటీ చైర్మన్ వై.ప్రభు, మాజీ ఎంపిటిసి నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ అడిషనల్ ఎస్పీలకు సన్మానం



డివి.శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీసభ్యులు

**రామాయంపేట, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఎస్పీ డివి.శ్రీనివాసరావును, అడిషనల్ ఎస్పీ మహేందర్, మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్‌లను సభ్యులు ఘనంగా సన్మానించారు. అక్టోబరు 21వ తేదీ పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసే విషయంలో జిల్లా ఎస్పీ, ఎఎస్పీలను వారు మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. అమరవీరుల పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం జిల్లా ఎస్పీ హెడ్‌క్వార్టర్స్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈసారి కూడా పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలని ఎస్పీ డివి.శ్రీనివాస్‌రావు సూచించారు. మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తం అందుబాటులో ఉంటుందని వారు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. అవసరమైన వారికి రక్తం అందుబాటులో ఉంటుందా? అని ఎస్‌పి ప్రశ్నించారు. రక్తదాతల సమూహానికి సంబంధించిన ఒక గ్రూపును క్రియేట్ చేస్తే బాగుంటుందని ఎస్పీ అభిప్రాయం వ్యక్తంచేశారు. అనంతరం మెదక్ డిఎస్పి డి,ప్రసన్నకుమార్‌ను కలిసి ఆయనను కూడా సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సుభాష్‌చంద్రబోస్, కోశాధికారి డిజి శ్రీనివాసశర్మ, ఎంసి మెంబర్లు దేమె యాదగిరి, ప్రసాద్‌లు ఉన్నారు.

## రాష్ట్రస్థాయికి పాపన్నపేట విద్యార్థులు ఎంపిక...




రాష్ట్ర స్థాయికి ఎంపికైన జట్టు

**పాపన్నపేట, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాల నుంచి అండర్ 17, అండర్ 14 విభాగంలో ఇరువురు విద్యార్థులు ఎంపికైనట్లు పాపన్నపేట ఫిజికల్ డైరెక్టర్ రమేష్ వెల్లడించారు, పాపన్నపేట పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న అశ్రుత, 9వ తరగతి చదువుతున్న నర్సింలు ఈనెల 13న పటాన్‌చెరులో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీపోటీలలో గెలుపొంది, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈనెల 15 నుండి పటాన్‌చెరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరుపాల్గొంటారని ఆయన తెలిపారు, తమవిద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికకావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు.

## న్యాయం చేసి ఆదుకోండి

-కలెక్టర్ కార్యాలయంలో ఐడిఎస్ఎంటి కాలనీవాసుల నిరసన



కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న ఐడిఎస్ఎంటి కాలనీవాసులు

**జహీరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
తమకు న్యాయంచేసి ఆదుకోవాలని పట్టణంలోని ఐడిఎస్ఎంటి కాలనీవాసులు మంగళవారం జిల్లాకేంద్రమైన సంగారెడ్డిపట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో నిరసన వ్యక్తంచేసి అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఐడిఎస్ఎంటి కాలనీ సర్వేనంబర్ 158లో 10 ఎకరాల విస్తీర్ణంలో తమ ప్లాట్లను, ఇళ్లను గత పదిరోజుల నుంచి ప్రయివేటు వ్యక్తులు బుల్డోజర్ సహాయంతో ధ్వంసంచేస్తూ చదును చేస్తున్నారని, చుట్టూ కంచెను ఏర్పాటు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. 1989 సంవత్సరంలో జహీరాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన లేఔట్‌లో తాము ప్రభుత్వానికి రుసుమను చెల్లించి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, 25 ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, ఇప్పుడు ప్రయివేటు వ్యక్తులు వచ్చి సదరుభూమి తమదని ప్రభుత్వం ఏర్పాటుచేసిన రోడ్లను, మంచినీటి సౌకర్యాలను, మురుగ కాల్వలను ధ్వంసంచేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక అధికారులకు పలుమార్లు సమస్యను విన్నవించినా ఈ అంశం కోర్టుపరిధిలో ఉందని, తాము స్పందించలేమని పేర్కొనడంతో కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వయంత్రాంగం ఈసమస్యను పరిష్కరించాలని, బాధితులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని డిమాండ్‌చేస్తూ నిరసన వ్యక్తంచేసి రెవిన్యూ జిల్లా అధికారి పద్మజారాణికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నామ రవికిరణ్, వెంకటేశంగుప్తా, నరసింహారెడ్డి, వెంకట్‌సాగర్, కాలనీ బాధితులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు



పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో అధికారులు

**మునిపల్లి, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
సమాచారహక్కు చట్టం 2005 ఇరవై సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండల కేంద్రమైన మునిపల్లిలోని మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థినీవిద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను మండల డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, ఎంఇఓ భీంసింగ్, కళాశాల ప్రిన్సిపాల్ మల్లిక అందజేశారు.

# సామాజిక న్యాయమే కాంగ్రెస్ లక్ష్యం..

-ప్రతిపక్షాలది రెండు నాలుకల ధోరణి

-టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రగౌడ్ విమర్శ

**రామాయంపేట, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
జనాభాపరంగా 85 శాతానికి పైగా ఉన్న బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు సామాజిక న్యాయం అందించాలని కాంగ్రెస్‌పార్టీ కంకణం కట్టుకుందని, పార్టీ అధినేతలు మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్‌గాంధీ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనను విజయవంతంగా పూర్తి చేయడమే కాకుండా లెక్కల ఆధారంగా సామాజిక న్యాయం జరగాలనే సదుద్దేశంతో విద్య, ఉపాధి, స్థానికసంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిందనీ టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచందర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి చట్టబద్ధత కోసం రాష్ట్రపతికి పంపగా అక్కడ పెండింగ్‌లో ఉందన్నారు. రాష్ట్రపతి ఆమోదం ఆలస్యం అవుతుండడంతో ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొస్తే అది గవర్నర్‌నుంచి రాష్ట్రపతి వద్దకువెళ్లి, మళ్లీ పెండింగ్‌లో పడిందని, అయితే న్యాయస్థానం ఆదేశాలమేరకు తెలంగాణలో స్థానికసంస్థల ఎన్నికలను త్వరగా నిర్వహించాల్సిన పరిస్థితుల దృష్ట్యా బిసిలకు అన్యాయం జరగకూడదనే దృఢనిశ్చయంతో రేవంత్‌రెడ్డిసర్కార్ బిసి రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ జివో విడుదలచేయడంతో బడుగు, బలహీనవర్గాలకు జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్‌లుగా ఎంపికయ్యే సువర్ణావకాశం వచ్చిందని రామచందర్‌గౌడ్ వివరించారు.

**హైకోర్టు స్టే ఇచ్చింది తప్ప బిసి రిజర్వేషన్ల పెంపును అడ్డుకోలేదు...**

తెలంగాణ ప్రభుత్వం జివోకు అనుగుణంగా స్థానికసంస్థల ఎన్నికల ప్రకటన విడుదలయ్యాక కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు సామాజిక న్యాయం దక్కిందనే ఆనందంతో బిసిలు నామినేషన్లువేస్తున్న సమయంలో కొందరు దురుద్దేశంతో న్యాయస్థానం ద్వారా అడ్డుకునేందుకు ప్రయత్నించడం శోచనీయమని, కోర్టు ఆదేశాలమేరకు స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణకు గడువు సమయం సమీపిస్తున్న వేళ ప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ విడుదలచేసిన జివోను సవాలుచేస్తూ కొందరు హైకోర్టుకు వెళ్లగా, కొన్ని సాంకేతిక అంశాల కారణంగా న్యాయస్థానం దానిపై స్టే విధించిందన్నారు.

**కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగానే...**

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించాలనే కృతనిశ్చయంతో కాంగ్రెస్ ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను 42శాతానికి పెంచిందని, ఈ చారిత్రాత్మక నిర్ణయంతో రాష్ట్ర బిసి సామాజికవర్గాల్లో కాంగ్రెస్ భరోసా నింపిందని, దీంతో బడుగు, బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీని తమహృదయాల్లో నిలుపుకోవడంతో కొందరు అక్కసుతో కోర్టుల ద్వారా రిజర్వేషన్ల పెంపును అడ్డుకోవాలనే కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఇలాంటివేమీ కొత్తకాదన్నారు. వెనకబడిన సామాజిక వర్గాల సంక్షేమానికి ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా న్యాయపరంగా అయినా, ప్రజాక్షేత్రంలో అయినా, పోరాటానికి కాంగ్రెస్ ఎప్పుడూ వెనుకంజ వేయలేదని తెలిపారు.

**ప్రతిపక్షాల ద్వంద్వనీతి బయటపడింది...**

బిసి రిజర్వేషన్ల పెంపునకు ప్రతిపక్ష పార్టీలైన బిఆర్‌ఎస్, బిజెపిలు సహకరించాల్సింది పోయి అక్కసుతో అడుగడుగునా అడ్డుకుంటున్నాయని, కులగణనసర్వే మొదలు, పెట్టినప్పుడు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు జరగవంటూ ముందస్తుగానే ప్రచారం చేశారని, ఆరెండు పార్టీలు కేసులో ఇంప్లీడ్ కాలేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై జాతీయ స్థాయిలో ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ వేదికగా చేపట్టిన నిరసన కార్యక్రమాలకు బిఆర్‌ఎస్ సహకరించలేదన్నారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ బిజెపి తీరును తప్పుపడితే బిఆర్‌ఎస్ మౌనం దాల్చిందని, బిసిలకు న్యాయం జరగడం పెత్తందారీవ్యవస్థతో కూడుకున్న బిఆర్‌ఎస్ పార్టీకి ఇష్టంలేదని, బిసిలకు వ్యతిరేకంగా బిఆర్‌ఎస్, బిజెపి పార్టీల ఫెవికోల్ బంధం చివరికి కోర్టులో నిరూపితమైందన్నారు. రెండు దఫాలు రాష్ట్రంలో అధికారం చెలాయించిన బిఆర్‌ఎస్ సామాజిక న్యాయానికి తిలోదకాలిచ్చిందని, స్థానికసంస్థల ఎన్నికల్లో 34శాతం ఉన్న బిసి రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించినఘనత బిఆర్‌ఎస్ పాలకులదని, రిజర్వేషన్లను 50శాతానికి మించకుండా పరిమితి విధిస్తూ కెసిఆర్ ప్రభుత్వం 2018లో తీసుకొచ్చిన చట్టం బిసిలకు ఉరితాడు అయిందన్నారు. బిసి సామాజికవర్గం రాజకీయ అవకాశాలను దారుణంగా దెబ్బతీసిన బిఆర్‌ఎస్ ఇప్పుడు బిజెపితో చేతులు కలిపి మరోసారి బిసిలకు అన్యాయం చేయాలని చూస్తుందన్నారు.

## జెఎన్టీయుహెచ్ ప్రిన్సిపాల్ బదిలీ

**చౌటకూరు, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలోని జెఎన్టీయుహెచ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బదిలీకాగా, కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విశ్వనాథాన్ని నియమిస్తూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఇంతవరకు ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ డాక్టర్ గుగులోత్ నరసింహాను జగిత్యాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. కళాశాలలో సిఎస్‌ఈ విభాగం ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.శ్వేను సుల్తాన్‌పూర్ కళాశాల సిఎస్‌ఈ విభాగానికి బదిలీచేశారు.

## స్థానిక ఎన్నికలు జరుగకుండా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం

-ఇంచార్జి తహసీల్దార్‌కు వనితిపత్రం అందచేత



తహసీల్దార్‌కు రాజిరెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థల ఎన్నికలు జరుగకుండా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు భోజగౌండ శివారాజ్ విమర్శించారు. మంగళవారం ఇంచార్జి తహసీల్దార్ రాజిరెడ్డికి శివరాజ్ వినతి పత్రం అందచేసి కార్యాలయం ముందు బిసి సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నర్సప్ప, శివకుమార్‌యాదవ్, బస్వరాజ్, లావేష్‌పటేల్, మైబూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

## డైసెల్ ల్యాబొరేటరీస్‌ను సందర్శించిన గీతం విద్యార్థులు



పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు

**పటాన్‌చెరు, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
అనుభవపూర్వక అభ్యాసం, పరిశ్రమ సందర్శన కార్యక్రమాలలో భాగంగా, హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ (జిఎస్‌పి) ఎం.ఫార్మా, పరిశోధక విద్యార్థులు ప్రముఖ పరిశోధన ఆధారిత ఔషధ సంస్థ డైసెల్ లాబొరేటరీస్‌ను సందర్శించారు. డైసెల్ చిరల్ టెక్నాలజీస్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్ తల్లూరి గీతంవిద్యార్థులను స్వాగతించగా, అధ్యాపకులు డాక్టర్ గటాడి శ్రీకాంత్, డాక్టర్ ప్రియాసింగ్ ఈ కార్యక్రమాన్ని సమన్వయంచేశారు. ఈపర్యటనను ఏర్పాటు చేసినందుకు స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్, అధ్యాపకులు డాక్టర్ బి.దుర్గాప్రసాద్, డాక్టర్ పి.ప్రతీక్, డాక్టర్ సి.బప్పాదిత్య, డాక్టర్ గటాడి శ్రీకాంత్, డాక్టర్ ప్రియాసింగ్‌లకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్

-విద్యార్థులకు మాదకద్రవ్యాలపైన అవగాహన



మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమం

**పటాన్‌చెరు, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బేగంపేట, హైదరాబాద్ జాతీయ సేవా పథకం చైర్మన్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.పద్మావతి, యూనిట్1 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.నరసింహులు, యూనిట్3 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.మధుకర్‌రావుల ఆధ్వర్యంలో ఆరవరోజు మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల ప్రత్యేకశిబిరం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఐనోల్, పెద్దకంజర్ల గ్రామాలలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు మాదకద్రవ్యాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీధివీధినా తిరుగుతూ మాదకద్రవ్యాల వినియోగంవల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ పోస్టర్లను అతికించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, యువనాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, గ్రామపెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## రాంపూర్ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం

**రామాయంపేట(నిజాంపేట), అక్టోబరు 14, ప్రభాతవార్త:**
నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించారు. గ్రామంలోని ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసిన డాక్టర్ మోహన్‌నాయక్‌ను మైనంపల్లి హనుమంతరావు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్‌నాయక్‌తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న అక్కన్నపేట...!

-వరుసగా మేకల దొంగతనాలు.. కొరవడిన పోలీసుల పర్యవేక్షణ..

**అక్కన్నపేట, అక్టోబరు 14, ప్రభాతవార్త:**
వరుస దొంగతనాలతో అక్కన్నపేట మండల బెంబేలెత్తిపోతుంది. గడిచిన మూడురోజుల క్రితమే అక్కన్నపేట మండలకేంద్రానికి చెందిన కాశబోయిన కనుకయ్య అనే రైతుకు సంబంధించిన ఎనిమిది మేకలను తన వ్యవసాయ బావి వద్ద ఏర్పాటుచేసిన షెడ్డులో సాయంత్రం తోలి ఉదయం వచ్చి చూసేసరికి మేకలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల ఎక్కడ దొరికినా, వాటి ఆచూకీ లభించకపోవడంతో చేసేదేమీలేక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా దాదాపు 20రోజుల క్రితం అంతకపేట గ్రామానికి చెందిన యామ మురళి అనే రైతు మధ్యాహ్నం సమయంలో తన వ్యవసాయ పొలం వద్ద తనకు సంబంధించిన ఆరు మేకలను పశువుల పాకలో కట్టేసి ఇంటికివెళ్లి సాయంత్రం తిరిగి బావివద్దకు వచ్చేసరికి కనబడలేదని, అంతేకాకుండా మండలకేంద్రంలోని ఎల్లమ్మగుడి సమీపంలో మంచినీళ్లబండకు చెందిన మిట్టపల్లి సాంబరాజు అనే రైతుకు సంబంధించిన ఒక మేకతోపాటు ఒక గొర్రెకూడా దొంగతనానికి గురైందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే మొదట దొంగతనం జరిగి మూడునెలలు గడుస్తున్నా, ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు దొంగలను పట్టుకోకపోవడంతో పోలీసుల తీరుపై మండలవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసుల పర్యవేక్షణ లేని కారణంగానే ఈ వరుస దొంగతనాలు జరుగుతున్నాయని మండలవ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల పట్ల పోలీసులు ఏవిధంగా వ్యవహరిస్తారో వేచిచూడాల్సిన అవసరం ఉండగా, మండలవ్యాప్తంగా పోలీసుల పర్యవేక్షణ ఉండాలని ఈప్రాంత మేధావులు తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు.